క్లుప్తంగా

హెచ్‌ఎంకు కలెక్టర్ అభినందన



అభినందిస్తున్న కలెక్టర్ పాటిల్

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న కొత్తగూడెం రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ప్రభుదయాళ్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం అభినందించారు. పని చేసిన ప్రతీ పాఠశాలలో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తుండడమే కాక పాఠశాలలో వసతుల కల్పనకు ప్రభుదయాళ్ పాటుపడడం అభినందనీయమని పేర్కొన్నారు.

ముగిసిన మండల స్థాయి పోటీలు



బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతలకు తహసీల్దార్ కె.స్వాతి బిందు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆటలు విద్యార్థి దశలో ఒక భాగమన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, ఐక్యమత్యం పెంపొందుతుందన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చిన దాతలు పెండ్యాల ప్రసాద్‌రావు, వేమూరి గురునాథం, అఖిల్‌ను తహసీల్దార్ అభినందించి, సన్మానించారు.

జేపీఏలకు పదోన్నతులు కల్పించండి..

పాల్వంచ: కేటీపీఎస్‌లో 2013 రిక్రూట్‌మెంట్ జూనియర్ ప్లాంట్ అటెండెంట్ (జేపీఏ)లకు పదోన్నతులు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు కోరారు. శుక్రవారం 5, 6 దశల చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్‌రావుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 11 సంవత్సరాలుగా పదోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అన్ని విభాగాల్లో పీఏ, ఫోర్‌మెన్ 1, 2, 4లో ఎస్టీ అభ్యర్థులతో సీనియారిటీ ప్రకటించి, పదోన్నతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాందాస్, నాగేశ్వరరావు, టి.బన్సీలాల్, డి.రవి, బి.లాలు, భాస్కర్, శ్రీను, రమేష్, మోహన్, సింగ్, రాంబాబు, మధులత, రామ్మూర్తి, ఆశీరం, అర్జున్, వీరన్న, శంకర్ పాల్గొన్నారు.

ఓజోన్ పొరను పరిరక్షించాలి



విజేతలను ఎంపిక చేస్తున్న ప్రిన్సిపాల్ పద్మ

పాల్వంచరూరల్: సూర్యుడి నుంచి వెలువడే అతినీల లోహిత కిరణాల నుంచి ఓజోన్ పొర మానవాళిని రక్షిస్తుంది. దానిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మ అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని సందర్భంగా లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో శుక్రవారం ఎకో క్లబ్, కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు అన్నారు.

ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

జూలూరుపాడు: శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏడో రోజు ప్రజలు మండపాల్లో వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమ్ముగూడెం గాంధీ తండాలో గురువారం రాత్రి మహిళలు దీపాలు వెలిగించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఛ్ఛీ.. కూరలు తినలేం!

- కన్నీళ్లు పెట్టిస్తున్న కూరగాయల ధరలు
- భారీ వర్షాలతో తగ్గిన దిగుబడి



మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఇల్లెందురూరల్: కూరగాయలు కొనేందుకు బజారుకెళ్తే పేద, మధ్య తరగతి ప్రజలు భయపడుతున్నారు. ఏ కూరగాయ కొనాలన్నా బాబోయ్ అనిపించేలా ధరలు మండిపోతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, స్థానికంగా కూరగాయల ఉత్పత్తి తగ్గుముఖం పట్టడం వంటి కారణాలతో ప్రస్తుతం మార్కెట్‌లో సామాన్యులు కొనలేనంతగా కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి.

వారం రోజుల వ్యవధిలోనే..

నిన్నటి వరకు కిలో రూ.10 ఉన్న టమాటా నేడు రూ.30 ధర పలుకుతోంది. కిలో రూ.20 ఉన్న బెండకాయ నేడు రూ.80కి చేరుకుంది. కోయకుండానే ఉల్లి కన్నీళ్లు పెట్టిస్తోంది. రూ.20గా ఉన్న ఉల్లి ధర నేడు ఏకంగా రూ.70కి పలుకుతోంది. అల్లం కిలో రూ.160కి చేరింది. ఉల్లి, అల్లం కంటే నేనేమైనా తక్కువా అన్నట్లుగా.. ఎల్లిపాయ కిలో రూ.360 నుంచి రూ.400 దిశగా పరుగులు పెడుతోంది. ఆకుకూరల ధరలు సైతం అంతనంత ఎత్తులో నిలిచాయి. కొత్తిమీర, పుదీన కిలో ఏకంగా రూ.200 ధర పలుకుతున్నాయి. బచ్చలకూర, గోంగూర, పాలకూర ధరలు సైతం పెరుగుతూ వస్తున్నాయి. ఇలా ఒకటేమిటి.. ప్రతీ కూరగాయ ధర ప్రస్తుతం కొండెక్కింది. భారీ వర్షాలకు ముందు సామాన్యుడికి అందుబాటులో ఉన్న కూరగాయల ధరలు కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఆకాశాన్నంటడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షాలతో పెరిగిన ధరలు..

రెండు తెలుగు రాష్ట్రాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఉద్యాన పంటలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. దీనికితోడు నేలలో అవసరానికి మించి పదును చేరుకోవడంతో కాండం కుళ్లి మొక్కలు ఎండిపోయాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతంతో పోలిస్తే కూరగాయల సాగు తగ్గుముఖం పట్టడం, ఆంధ్రా నుంచి వచ్చే దిగుమతులపై ఆధారపడటం .. వంటి కారణాలతో జిల్లాలో అవసరానికి సరిపడా కూరగాయలు అందుబాటులో లేకుండాపోయాయి. దీంతో జిల్లాలో కూరగాయల ధరలు ప్రస్తుతం ఆకాశం వైపు చూస్తున్నాయి. సామాన్యుడు వాటిని అందుకోలేక పచ్చడి మెతుకులకే పరిమితం కావాల్సిన దుస్థితి. ప్రకృతి వైపరీత్యాలు ఎదురైన సందర్భంలోనూ ధరలను అదుపు చేయడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించకపోవడం విచారకరం.

ఎందుకీ పరిస్థితి..

జిల్లాలోని జనాభా అవసరాలకు అనుగుణంగా కూరగాయల ఉత్పత్తికి అవసరమైన ప్రోత్సాహం రైతులకు అందడం లేదు. కనీసం ఉప ఉత్పత్తులపైనన్నా ప్రజలను పూర్తిస్థాయిలో అధికారులు చైతన్యం చేయడం లేదు. కనీసం ఉద్యాన శాఖ అధికారులు కూరగాయల పంటలు అధిక విస్తీర్ణంలో సాగయ్యే ప్రాంతాలలోనూ పర్యటించకపోవడం, రైతులకు చీడపీడల నివారణ, వాతావరణ పరిస్థితులపై అవగాహన కల్పించే వారే లేరు. అంతేకాకుండా 12వేల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగవుతున్నా జిల్లాలో ఒక్కటంటే ఒక్కటి కూడా కూరగాయల నిల్వ కోసం కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేయలేదు. పండించిన పంట మార్కెట్‌కు తప్ప నిల్వలకు వేరే మార్గం లేదు. జిల్లాలో ప్రతీ నియోజకవర్గానికి ఒక మార్కెట్ కమిటీ ఉంది. కానీ ఏ ఒక్క కమిటీ కూడా కూరగాయలు నిల్వ చేసేందుకు కూల్‌చాంబర్ల నిర్మాణానికి నేటికీ ప్రాధాన్యమివ్వలేదు.

కూరగాయలు కొనేటట్టు లేదు..



సంచి పట్టుకొని మార్కెట్‌కు వెళితే రూ.వంద నోటు ఖర్చుయిపోతోంది. కానీ కిలో కూరగాయలు కూడా చేతికి రావడం లేదు. మార్కెట్‌లో ధరలన్నీ మండిపోతున్నాయి. ఇలాగైతే ఏం కొంటాం.. ఏం తింటాం.. చివరకు పచ్చడి మెతుకులే దిక్కయ్యేలా ఉంది. – పూనెం కమల, సుభాష్‌నగర్

ఆకుకూరల ధరలు కూడా..



కూరగాయల ధరలతోపాటు ఆకు కూరల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. చివరకు కొత్తిమీర, పూదీన కిలో రూ.వంద దాటుతోంది. కూరగాయలతోపాటు ఆకు కూరలూ కొనలేకపోతున్నాం. ఇంటి ఆవరణలో పండించుకుందామంటే కోతుల బెడద. – వేముల సుగుణ, బాలాజీనగర్

భారీ వర్షాల వల్లే..



భారీ వర్షాల కారణంగా కూరగాయల దిగుమతి తగ్గిపోయింది. అవసరానికి సరిపడా దిగుబడి లేకపోవడం వల్లే ధరలు పెరిగాయి. గణేష్ నవరాత్రుల అన్నదాన కార్యక్రమాలు కూడా ధరలపై ప్రభావం చూపుతోంది. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుంది.– జానీ, కూరగాయల వ్యాపారి, ఇల్లెందు

స్థానికంగానే గణేష్ నిమజ్జనం



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ పక్కన చైర్మన్ డీవీ, కమిషనర్ యాదగిరి

ఇల్లెందు: ఇల్లెందులో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి ఎట్టకేలకు సత్యనారాయణపురం చెరువును ఖరారు చేశారు. శుక్రవారం ఇల్లెందు మున్సిపాలిటీలో చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన గణేష్ నిమజ్జన మండలి సభ్యులు, అధికారులు, కౌన్సిలర్లు, రాజకీయ పక్షాలతో జరిగిన సమావేశంలో చర్చించి నిర్ణయించారు. ఈ నెల 17న గణేష్ నిమజ్జనం నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచనతో సత్యనారాయణపురం చెరువును ఖరారు చేసినట్లు చైర్మన్ డీవీ వెల్లడించారు. ఈసారి పాత బస్టాండ్ సెంటర్‌లో స్టేజీ నిర్మాణం ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. విగ్రహాలకు ఘనంగా స్వాగతం పలికి వీడ్కోలు పూజలు అందించటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలను అలరించేలా సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని తెలిపారు. సింగరేణి సహకారంతో భారీ క్రేన్ సహాయంతో విగ్రహాలను నిమజ్జనం చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీస్ బందోబస్తు ఉంటుందని చెప్పారు. చెరువు కట్ట వద్ద విద్యుత్ దీపాలు అలంకరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ యాదగిరి, సీఐ బత్తుల సత్యనారాయణ, కౌన్సిలర్లు, మడుగు సాంబమూర్తి, దానియేల్, జాఫర్, కె.సంజీవరెడ్డి, డీకే శ్రీను ఉన్నారు.

విద్యార్థులు కలిసిమెలిసి ఉండాలి..



మాట్లాడుతున్న వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: కౌమర దశలో విద్యార్థులు కలిసిమెలిసి స్నేహంగా మెలగాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)ఎం.వెంకటేశ్వరాచారి, కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల ఆఫీసర్ డాక్టర్ రాకేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా శాఖ అధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో జిల్లాస్థాయిలో కౌమర విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు పోస్టర్ మేళాను నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ.. జిల్లాలో ఎంపిక చేసిన 84 పాఠశాలలో కౌమర విద్యా కార్యక్రమంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌమర దశలో బాలబాలికల్లో కలిగే శారీరక, మానసిక, ఉద్వేగ పరమైన మార్పుల గురించి విద్యార్థులకు వివరించడం జరుగుతుందన్నారు. మాదవద్రవ్యాలు, ఇతర ప్రమాదకరమైన ప్రవర్తన, లైంగిక వేధింపులు, భావవ్యక్తీకరణ ద్వారా ఆరోగ్యవంతమైన సంబంధాల కోసం పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఏ.నాగరాజుశేఖర్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు, రిసోర్సు పర్సన్‌లు చంద్రశేఖర్, సునందిని, రాజేష్‌కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణిలో క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి డబ్ల్యూపీఎస్ జీఏ స్పోర్ట్స్ క్రీడా పోటీలను ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో శుక్రవారం ఏరియా ఎస్‌ఓటూ జీఎం జి.కోటిరెడ్డి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతో ఉపకరిస్తాయని, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవటం కోసం ప్రతీరోజు మనం ఏదో ఒక క్రీడను ఎంచుకొని ఆడాలన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి వి.మల్లికార్జున్‌రావు, సీఎంఓఏఐ కొత్తగూడెం ఏరియా జనరల్ సెక్రటరీ ఉపేంద్రబాబు, డీజీఎం పర్సనల్ బి.శివకేశవరావు, డీవైపీఎం శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం)/ఇల్లెందు: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ నాయకుల దాడులపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగూడెంలోని జిల్లా బీఆర్‌ఎస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... కౌశిక్‌రెడ్డిపై దాడి చేయటం దుర్మార్గం అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గుండాగిరి నడుస్తోందని, ప్రజల చేత ఎన్నుకోబడిన ఒక ఎమ్మెల్యేపై ఇంటిపై పట్టపగలు దాడిచేయటం హేయమైన చర్య అన్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన సంఘటన అత్యంత దారుణమని, ప్రజాస్వామ్యవాదులంతా దీనిని ఖండించాలన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై దాడులను బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు సిలివేరు సత్యనారాయణ ఖండించారు. శుక్రవారం ఇల్లెందులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దాడులకు పాల్పడిన గాంధీతోపాటు మిగిలిన వారిపై హత్యాయత్నాం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు తాము పార్టీ మారినట్లు చెప్పుకునే ధైర్యం లేదన్నారు. కోర్టు మొట్టికాయలు వేసినా పార్టీ మారిన వారిలో చలనం లేదన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన



ఇల్లెందురూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ, వార్డుల వారీగా ఫొటో ఓటరు ముసాయిదా జాబితాను శుక్రవారం గ్రామపంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో అధికారులు ప్రదర్శించారు. మండలంలో మొత్తం 46,094 మంది ఓటర్లు ఉన్నారు. అభ్యంతరాలు ఉంటే పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీ వరకు ఫిర్యాదు చేయవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

జూలూరుపాడు: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని 24 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం ముసాయిదా ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యదర్శులు ప్రదర్శించారు. మండలంలో మొత్తం 27,578 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 13,522 మంది, మహిళా ఓటర్లు 14,056 మంది, ఇతరులు నలుగురు ఉన్నట్లు ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. అభ్యంతరాలు ఉంటే గ్రామ పంచాయతీ సెక్రటరీలకు ఫిర్యాదు అందజేయాలని సూచించారు.

టేకులపల్లి: మండలంలోని గ్రామపంచాయతీల్లో ఓటరు జాబితాను నోటీసు బోర్డులపై ప్రదర్శించడం జరిగిందని ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద మాట్లాడారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 19వ తేదీ లోపు సంబంధిత పంచాయతీ కార్యదర్శికి, ఎంపీఓ, ఎంపీడీఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా అందజేయాలని కోరారు.

'మహాలక్ష్మి' ధృవపత్రాలు అందజేత



ఇల్లెందురూరల్: ధృవపత్రాలను కార్యదర్శులకు అందజేస్తున్న తహసీల్దార్ రవికుమార్

ఇల్లెందు: ప్రభుత్వం ఆరుగ్యారంటీల అమలులో భాగంగా సబ్సిడీ గ్యాస్ పథకం అమలు చేస్తోందని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో గ్యాస్ సబ్సిడీ పథకం పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

ఇల్లెందురూరల్: లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ ధ్రువపత్రాలను పంపిణీ చేయాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆయా ధృవపత్రాలను రేషన్‌షాపుల వారీగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సూచించారు. ఎంపీఓ చిరంజీవి, సెర్ప్ ఏపీఎం దుర్గారావు పాల్గొన్నారు.

టేకులపల్లి: ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగంగా ప్రజలకు రూ.500లకే వంట గ్యాస్ అందిస్తోంది. ఈ పథకానికి టేకులపల్లి మండలంలో 7,146 మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లిలో మహాలక్ష్మి ధృవీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ప్రారంభించారు. సోమవారం నుంచి గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు పంపిణీ చేస్తారని తెలిపారు.

పాల్వంచరూరల్: మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న గ్యాస్ సబ్సిడీ వివరాలను ప్రతీ ఇంటికి వెళ్లి తెలియజేయాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి తహసీల్దార్ వివేక్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్లు, డీఆర్‌డీఏ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 541మంది లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేశారు. సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీఓ బి.నారాయణ, ఏపీఎం రాంబాబు, ఏపీఓ రంగా, ఆర్‌ఐ, హచ్యా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సింగరేణి(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం రైటర్ బస్తి గొల్లగూడెం, రామాటాకీస్, సన్యాసి బస్తి, బస్టాండ్ ఏరియా, బర్మాక్యాంపు, బాబుక్యాంపు, బర్లిఫిట్, మధురబస్తీ ప్రాంతాలలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని కొత్తగూడెం ఏడీఈ ఆపరేషన్స్ హేమచంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సఫరాను నిలిపివేయడం జరుగుతుందని ఏఈ ప్రతాప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హమాలీ కాలనీ, జయమ్మ కాలనీ, కాంట్రాక్టర్స్ కాలనీ, బాపూజీనగర్, ఇందిరానగర్, శివనగర్‌లో ఉదయం 9గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

టేకులపల్లి: టేకులపల్లి, కోయగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టేకులపల్లి ఏఈ హట్కర్ దేవా, బొమ్మనపల్లి ఏఈ పి.బుజ్జి కన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోయగూడెం సబ్‌స్టేషన్ పరిధి, టేకులపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దినేష్

టేకులపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని టేకులపల్లి మండల వైద్యాధికారి కందుల దినేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులంలో పీహెచ్‌సీ వైద్య బృందం వైద్య శిబిరం నిర్వహించారు. పిల్లలకు వైద్యచికిత్స అందించి, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

ఏహెచ్‌ఆర్‌ఏ జీఓ విడుదల చేయాలి

టేకులపల్లి: ఏహెచ్‌ఆర్‌ఏ జీఓ విడుదల చేయాలని టీఎస్‌టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం సభ్యత్వం నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కుంటల, హనుమ తండా, మంగలి తండా పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాంకుడోత్ రమేష్ బాబు, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

హైపవర్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు, లాభాల బోనస్ చెల్లించాలని, ఇఫ్టూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జే.సీతారామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వివిధ డిపార్ట్‌మెంట్లతోపాటు ఎన్నో ఏళ్లుగా సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో పర్మనెంట్ కార్మికులతోపాటు సుమారు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి లాభాల వాటాను చెల్లించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి లాభాల వాటాలో ప్రభుత్వాలకు, ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు దానధర్మాలు చేస్తున్నారని కాంట్రాక్ట్ కార్మికులను మాత్రం పట్టించుకోకపోడం దురదుష్టకరమన్నారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2013లో తీర్పునిస్తే నేటికీ అమలు చేయకపోవటం విచాకరమన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కనీసం ఈసారైనా లాభాల్లో వాటా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యల సాధన కోసం ఈనెల 30న చలో హైదరాబాద్ జరపతల పెట్టామని, కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ తోడేటి నాగేశ్వరరావు, కొండపల్లి శ్రీను, కే.సారంగపాణి, డి.ప్రసాద్, అలీమొద్దీన్, రావూరి ఉపేందర్, వీరమల్ల మల్లయ్య, సురేష్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ఇల్లెందురూరల్: పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి సూచించారు. మండలంలోని పోలారం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ పాఠశాలల్లో శుక్రవారం పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ పాఠశాలల్లో అందించే ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. పౌష్టికాహారాన్ని ఇంటివద్దే తయారు చేసుకునే పద్ధతులపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ పాఠశాలల్లో ఆటపాటలతో విద్యాబోధన జరుగుతోందని చెప్పారు. సూపర్‌వైజర్ సక్కుబాయి, డీసీపీయూ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టేకులపల్లి: వివాహ వయసు రాకముందే, 18 సంవత్సరాలలోపు బాల్యవివాహాలు చేయడం చట్ట విరుద్ధమని టేకులపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ కె.అనురాధ, గంగారం సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి తెలిపారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బద్దుతండా, గంగారం సెక్టార్ పరిధిలో కిష్టారం, లచ్చగూడెం జీపీలలో వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ రాజు, ఆశా వర్కర్ విజయ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఏచూరి మృతి తీరని లోటు..

సమకాలీన భారత రాజకీయాల్లో సీతారాం ఏచూరి పాత్ర తిరుగులేనిదని, ఆయన మరణం కార్మిక వర్గానికి, దేశవాసులకు తీరని లోటని సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయాల్లో సీతారాం చిత్రపటాల వద్ద పూలు నివాళులర్పించారు. మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన ఏచూరి విప్లవం, దేశ సమైక్యత కోసం భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: సీతారాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



సింగరేణి(కొత్తగూడెం): నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పాల్వంచ: మాట్లాడుతున్న రమేష్